క్లుప్తంగా

వర్షంతో చిరువ్యాపారులకు ఇబ్బందులు



వారసంతలో టార్పాలిన్లు కప్పుకున్న వ్యాపారులు

దహెగాం: గత వారం రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మండల కేంద్రంలో వారసంత కావడంతో కురిసిన వర్షం వల్ల చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వస్తువులు తడవకుండా వ్యాపారులు టార్పాలిన్లతో డేరాలు కట్టుకున్నారు. సరుకులు కొనుగోలు చేయడానికి ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సైతం వర్షంలో తడిచి ఇబ్బందులు పడ్డారు.

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పోచయ్య



పోచయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పోచయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రె మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రోహిత్ దేశ్‌పాండే మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పోచయ్యకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

'అధికారుల ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఊరుకోం'

రెబ్బెన: ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడిగా పని చేసే నాయకుడు తన సొంత ప్రయోజనాల కోసం సింగరేణి అధికారులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతూ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే ఊరుకోబోమని బెల్లంపల్లి ఏరియా సీఎంవోఏఐ అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిపై ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడిపై పత్రిక ప్రకటన ద్వారా చేసిన ఆరోపణలను అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో సైతం ఇదే తరహాలో చులకనగా వ్యాఖ్యానించాడని, ఇలాంటి నాయకుల మాయమాటలు నమ్మకుండా కార్మికులు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.

నిధులు విడుదల చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

దహెగాం: గ్రామ పంచాయతీలలో నిధులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అల్బర్ట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నెలల నుంచి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. గ్రామాల్లో ఆర్థిక పరమైన పనులు చేయబోమని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'చాట్‌బాట్'

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా కూడా విద్యుత్ సంబంధిత సమస్యలు తమ దృష్టికి తీసుకురావొచ్చని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాథోడ్ శేషారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు తమ మొబైల్ నుంచి 7901628348 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. అనంతరం ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించి విద్యుత్ సేవలు పొందవచ్చని సూచించారు.

తాగునీటి కోసం నిరసన

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లిలో నీటి కోసం గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. గ్రామంలోని ఎస్టీవాడలో గత ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీటి సరఫరా లేదని కాలనీవాసులు నిరసన తెలిపారు. ఖాళీ బిందెలతో కాలనీలోని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. బావులు లేకపోవడంతో నీటికోసం ఇతర కాలనీల్లో బోరు మోటారు వారికి రూ.500 చెల్లించి నీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

అందని కిట్లు.. కూలీల పాట్లు!

- గాయాలైతే ఆస్పత్రికి పరుగులు
- 2015 నుంచి అందని వైనం
- ఓఆర్ఎస్‌తోనే సరి
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



గోయగాంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం నీడ కోసం గ్రీన్‌నెట్, వాటర్‌బాటిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతోనే సరిపెడుతోంది. అనుకోకుండా గాయమైతే కనీసం ప్రథమ చికిత్స కోసం ఎలాంటి సదుపాయం లేకపోవడంతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. – కెరమెరి

పల్లెల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోట కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మాత్రమే సమకూర్చారు. మండలంలో జాబ్‌కార్డులు 10,310 ఉండగా యాక్టివ్ జాబ్‌కార్డులు 8370 ఉన్నాయి. కూలీలు 18,806 ఉండగా యాక్టివ్ కూలీలు 14,447 మంది ఉన్నారు. 120 మంది మేట్లు పనిచేస్తున్నారు. గత నెల రోజుకు సరాసరి 4507 మంది కూలీలు పనిచేయగా ఈ నెలలో 3630 మంది పనులు చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రాలకు పరుగులు..

కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలలో ప్రథమ చికిత్స కిట్లు ప్రధానమైనవి. పని ప్రదేశంలో గునపాలు, పారలు, తట్టలతో మట్టి పనులు చేస్తున్నప్పుడు కూలీలు గాయపడితే చికిత్స అందుబాటులో ఉండడం లేదు. పని ప్రదేశంలో కూలీలు గాయపడితే ప్రథమ చికిత్స అందించే వసతి లేక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నామని కూలీలు చెబుతున్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించేలోపు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యతలు తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు అవసరమైన కిట్లపై అధికారులు శ్రద్ధ చూపకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. కిట్‌లో ప్రధానంగా అయోడిన్ సీసా, బ్యాండేయిడ్, దూది, దెబ్బతాకితే కట్టేందుకు పట్టి, వివిధ రకాల మందులు, ఆయింట్‌మెంట్లు ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు రక్తస్రావం జరిగితే కనీసం దాన్ని ఆపేలా కట్టుకునేందుకు వీలు ఉంటుంది. అధికారులు స్పందించి కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

2015 –16 నుంచి లేవు..

2015- 16 నుంచి ఆరోగ్యకిట్లు అందుబాటులోకి లేవు. పనిప్రదేశాల్లో వాటిని ఏర్పాటు చేయలేదు. పంచాయతీలు వీటిని ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. కానీ పాలకవర్గాలు లేకపోవడం, నిధులు కొరత కారణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కష్టమవుతుందని, ఇక ప్రథమ చికిత్స కిట్లు ఎలా సమకూర్చగలమని గ్రామ పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. 16 నెలలుగా నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాం..



కూలీలు పని చేసే ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాం. కొన్నేళ్లుగా ప్రథమ చికిత్స కిట్లు మంజూరు కావడం లేదు. ఉపాధిహామీ పథకం వ్యవహారం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంది. అక్కడి నుంచే కిట్లు అందాల్సి ఉంది. కానీ ఇంకా అందలేదు. కూలీలకు ఏదైన గాయమైతే ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నాం

- మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

'విద్యుత్' అంతరాయంతో తిప్పలు

- ఈదురుగాలులకు నేలకొరుగుతున్న స్తంభాలు
- మరమ్మతులకు జాప్యం చేస్తున్న సిబ్బంది



జామిని సడక్‌గూడలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జైనూర్: మండలంలో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతుండడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలానికి ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేసేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయడానికి విద్యుత్‌శాఖ లక్షల రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ విద్యుత్ సిబ్బంది పనులను నామమాత్రంగా చేస్తుండడంతో వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది.

మరమ్మతుల్లో జాప్యం..

గత కొన్ని రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఏజెన్సీ మండలంలో దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ స్తంభాలు కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఈదురుగాలులకు నేలకొరుగుతున్నాయి. వీటిని సరి చేయాల్సిన సిబ్బంది పనుల్లో జాప్యం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా జామినిలో ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌పార్మర్‌లో నిత్యం సమస్య ఏర్పడుతుండగా, సిబ్బంది మరమ్మతులు చేస్తూ మమ అనిపిస్తున్నారే తప్పా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సమస్య పరిష్కరించాలి



మా గ్రామంలో నిరంతరం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. సంబంధిత లైన్‌మెన్‌ను సంప్రదిస్తే అందుబాటులో ఉండడం లేదు. అధికారులు శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చాలి. సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి.

- దోంగ్రే సమాధాన్, హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్, జామిని

హమాలీ అగ్రిమెంట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యాపారులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రాజస్థాన్ భవనంలో పట్టణంలోని వ్యాపార మార్కెట్ కమిటీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం హమాలీ అగ్రిమెంట్ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు హమాలీ సంఘం నాయకుల మధ్య చర్చలు జరగ్గా గత హమాలీ ధరల కంటే 12 శాతం ఎక్కువ ధరలకు అగ్రిమెంట్‌కు ఒప్పందం జరిగినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ అసోసియేషన్ సభ్యులు వెంకటరమణ, మహేశ్‌లోయ, కమల్ కిషోర్, విజయ్ కుమార్, కిషోర్‌జాజు, అరుణ్, అగర్వాల్, శ్రీనివాస్, సత్యనారాయణ, సోని, హమాలీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు గులం దస్తగిరి, అలవాల చంద్రయ్య, మమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు, జాతీయ ఉద్యమంలో ప్రథమంగా అరెస్టయిన మహోన్నత వ్యక్తి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసిన కేబినెట్ మంత్రి, నిజాంపై పోరాటం చేసిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపక చైర్మన్ జ్ఞానేశ్వర్ కోరారు. జూన్ 2వ తేదీన కొండా లక్ష్మణ్ బాపూజీనీ తెలంగాణ జాతిపితగా గౌరవించాలని, అందుకు సంబంధించిన గోడప్రతులను మంగళవారం జిల్లా కేంద్రంలో సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల అంజనేయులు, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, సంఘం సభ్యులు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. మండలంలోని కుంబారి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన హరి హంటర్స్, వెంకీ వారియర్స్ జట్లకు ఆయన నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు డబ్బా బాపు, మండలాధ్యక్షులు ఆత్రం సత్తయ్య, నాయకులు చిలుకయ్య, అశోక్, హన్మంతు, మహేశ్, కార్తీక్, బుర్స నాగయ్య, అంజన్న, రామయ్య, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు పండించాలి



రైతులతో మాట్లాడుతున్న బాలాజీ

కెరమెరి: రైతులు సేంద్రియ పంటలు పండించాలని సేంద్రియ రైతు సంఘం అధ్యక్షుడు కేంద్రె బాలాజీ అన్నారు. మంగళవారం మండలంలోని నాగల్‌గొంది గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, పంటల్లో దిగుబడులు కూడా అధిక మోతాదులో రావన్నారు. రసాయన ఎరువులు, మందులు వాడడంవల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. మండలంలో అధిక మంది రైతులు సేంద్రియ పంటలను పండించాలనే ఉద్దేశంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేంద్రియ రైతులు న్యానేశ్వర్, నాగ్‌నాథ్, గేడా మధుకర్, రైతులు సిడాం జైతు, సిడాం దేవ్‌రావు ఉన్నారు.

గుంత పూడ్చివేత

కౌటాల: మండలంలోని కన్నెపల్లి ఎక్స్‌రోడ్ వద్ద కన్నెపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై గుంత ఏర్పడడంతో కన్నెపల్లి మాలి యువజన సంఘం అధ్యక్షుడు మోర్లె పాండురంగ్ మొరం వేయించి గుంత పూడ్చి వేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా ట్రాక్టర్లతో మొరం వేయించిన పాండురంగ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇప్పల్‌నవేగాం గ్రామస్తుల నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని ఇప్పల్ నవేగాం గ్రామాన్ని కాపాడాలని గ్రామస్తులు ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టారు. మంగళవారం గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించేందుకు రాగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ తాతముత్తాతల నుంచి నివాసం ఉంటున్న గ్రామాన్ని, తమ ఇళ్లను కాపాడుకునేందుకు గత వారం ఆర్డీవో లోకేశ్వర్‌రావ్‌కు విన్నవించగా ఎలాంటి స్పందన లేదన్నారు. నిరసనకు జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేశ్ మద్దతు పలికారు.

'నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు'

జైనూర్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొంటే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు మండాడి లింగు, పంద్ర శేకు, నాయకులు అమృత్, దత్తు, హైదర్, ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

రైతులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి రైతువేదికలో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తనాలపై మంగళవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదులు తప్పకుండా తీసుకోవాలన్నారు.

రమాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘం నాయకులు

వాంకిడి: బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో రమాబాయి 89వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ చదువు కోసం తాను చేసిన త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, నాయకులు ఉప్రె విజయ్, దుర్గం ప్రశాంత్, రోషన్, శ్యాంరావు, లహుజీ, రాజేంద్రప్రసాద్, రమేశ్, శివాజీ, పాండుజీ, జైపాల్, కమలబాయి, నాగ్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే



మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని గణేశ్‌పూర్, సోనాపూర్ గ్రామాల్లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను గ్రామ పంచాయతీ కార్మికుల సహకారంతో శుభ్రం చేయించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగే అవకాశాలు ఉన్నందున నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వైద్య శిబిరం నిర్వహించి 43 మందికి పరీక్షలు చేశారు. జ్వర లక్షణాలు ఉన్న నలుగురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. పలువురికి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, పంచాయతీ కార్యదర్శి విద్యశ్రీ, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, సునంద, ఆశలు పాల్గొన్నారు.

మూడు నెలల రేషన్ సరుకులు అందించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజ్ అలీ

వాంకిడి: వర్షాకాలం నేపథ్యంలో మూడు నెలలకు సంబంధించిన రేషన్ సరుకులను ఒకేసారి పంపిణీ చేయాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30 వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలిసేలా గ్రామాల్లో డప్పు చాటింపు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఆర్ఐ మాజిత్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని జయంతి



శనీశ్వరుడికి హారతి ఇస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయం ప్రాంగణంలో మంగళవారం శనీశ్వర జయంతి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శనీశ్వరుడి విగ్రహానికి భక్తులు తైలాభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలో శనీశ్వర స్వామి ఉన్న ఏకైక ఆలయం కావడంతో జిల్లా నలుమూల నుంచి భక్తులు ఇందిరానగర్ తరలివచ్చారు. వేకువజామునే తరలివచ్చిన భక్తులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శనీశ్వర స్వామితో పాటు కాలభైరవ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్‌స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: ఇండియన్ ఆర్మీకి సంఘీభావంగా పట్టణంలోని మార్కెట్ వీధుల గుండా రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు బీజేపీ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శివ, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి, పుల్ల అశోక్, మనోహర్‌గౌడ్, చిప్పకుర్తి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన భువనేశ్వరి

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎయిర్‌గన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భువనేశ్వరి మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎయిర్‌గన్ శిక్షణ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే శిక్షణకు కావాల్సిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎయిర్‌గన్‌తో షూట్ ఏవిధంగా చేయాలో ఎమ్మెల్యేకు వివరించారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం నాయకులకు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలోని మున్నూరు కాపు సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులను మంగళవారం ఘనంగా సన్మానించారు. సిర్పూర్ తాలూకా అధ్యక్షులుగా సుంకరి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా గోలెం వెంకటేశం, కోశాధికారిగా దెబ్బటి జలపతి, కస్తూరి అఖిలేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

వాంకిడి: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. అనంతరం యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ స్వతంత్ర భారత తొలి ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, రచయితగా, పండితుడిగా గొప్ప ప్రాచుర్యం పొందారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు ఉప్రె సురేందర్, యుగాంత్, దుర్గం దీపక్, రాషద్, సునీల్, విజయ్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల విక్రయాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు అనుమతి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విక్రయదారులు ఈ నెల 30లోగా అర్హత పత్రాలతో గడిచిన మూడేళ్ల వాణిజ్య పన్ను చెల్లింపు, త్రైమాసిక టర్నోవర్ ట్యాక్స్ ఆడిట్ రి పోర్టులతోపాటు జిల్లా విద్యాశాఖాధికారి పే రుతో తీసిన రూ.5వేల డీడీని డీఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.